క్లుప్తంగా

ఉపాధి నిధులతో మట్టిరోడ్డు



మట్టి రోడ్డు పనులు

రాజవొమ్మంగి: జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో అప్పలరాజుపేట నుంచి బడదనాంపల్లి రహదారిని కలుపుతూ మట్టి రోడ్డు రూపుదిద్దుకొంటోంది. ఈ రహదారి నిర్మాణానికి 6 లక్షల 53 వేల 294 రూపాయలు విడుదలయ్యాయని, రెండు రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎంపీడీవో/ప్రోగ్రాం ఆఫీసర్ బాపన్నదొర సోమవారం తెలిపారు. రెండు ప్రధాన రహదారులను కలుపుతూ నిర్మిస్తున్న ఈ రహదారి వల్ల పలు గ్రామాలకు రవాణా కష్టాలు తొలగనున్నాయన్నారు.

ఎండీఎం ఆపరేటర్‌పై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు, జెడ్పీటీసీ

అనంతగిరి: స్థానిక ఎండీఎం వాహన ఆపరేటర్‌పై తహసీల్దార్ రాంబాయికి జెడ్పీటీసీ గంగరాజు రేషన్‌లబ్ధిదారులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇంటింటికీ రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని వాపోయారు. దీనిపై స్పందించి రేషన్‌బియ్యం సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో ఎంపీడీవో తనిఖీ



ఎ. బంధవీధి పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

జి.మాడుగుల: పాలమామిడి పంచాయతీ పరిధి కొక్కిరాపల్లి, ఎ.బంధవీధి ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు గురించి ఆరా తీశారు. ఆయా పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. మెనూ అమలు తీరు, మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, మెనూ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

అడ్డతీగల: ఈ నెలతో పాటు మే, జూన్ మాసాలకు సంబంధించి సదరం స్లాట్‌ల బుకింగ్ సోమవారం నుంచి ప్రారంభమైందని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగులు) వారికి నిర్దేశిత ఆస్పత్రుల్లో వైద్యులు తగిన పరిశీలించి ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ముందుగా సదరం స్లాట్‌లు బుకింగ్ చేసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో స్లాట్‌లు బుక్ చేసుకోవచ్చన్నారు. ఏ ఇతర జిల్లాల్లోనైనా సదరం ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చన్నారు.

పవనగిరి క్షేత్రంలో పూజలు



సదానంద సరస్వతి స్వామీజీ పాదుకలకు నమస్కరిస్తున్న శిష్యులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రాన్ని సోమవారం రాజమహేంద్రవరానికి చెందిన సదానంద సరస్వతి స్వామీజీ కుటుంబీకులు సందర్శించారు. క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య వారిని సాదరంగా ఆహ్వానించారు. సదానంద సరస్వతి సోదరుని కుమారుడు శివప్రసాద్, విద్యుల్లత దంపతులు అక్కడ అన్ని దేవాలయాలను సందర్శించారు. తొలుత తమ గురువైన సదానంద సరస్వతి స్వామీజీ పాదుకలు, చిత్రపటానికి నమస్కరించారు. పవనగిరి క్షేత్రం కేంద్రంగా సాగుతున్న ఆధ్యాత్మిక సేవలకు భవిష్యత్‌లో తాము తోడై మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని శివప్రసాద్ దంపతులు చెప్పారు.

ఇంటింటా 'మా నమ్మకం నువ్వే జగన్'



పెదబయలు: సీకరిలో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, కన్వీనర్లు



రాజవొమ్మంగి: కింద్రలో వివరిస్తున్న నాయకులు



అరకులోయ రూరల్: ప్రభుత్వ పథకలపై వివరిస్తున్న నాయకులు



డుంబ్రిగుడ: కంద్రుంలో ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ



చిన్నబందవీధిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ



వీఆర్‌పురం: చింతరేవుపల్లిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న దృశ్యం



కూనవరం: చూచిరేవుల గూడెంలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: ఇంటింటికీ ప్రజా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ తెలిపారు. సోమవారం డుంబ్రిగుడ మండలం కంద్రుం, గుంటగన్నెల, క్రొద్రాయి పంచాయతీల్లో వారు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. ఎటువంటి సమస్యలున్నా నేరుగా తమ దృష్టికి తీసుకు వస్తే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ద్వారా పరిష్కరిస్తామన్నారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, పంచడి లలిత, గ్రామ సచివాయ కన్వీనర్ గణపతి, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, వినోద్, బాలరాజు, సింహాచలం పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ విశాఖ ఉమ్మడి జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు తెలిపారు. జగనన్నే మా భవిషత్తు కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం చిన్నలబుడు పంచాయతీ మాల్లిసింగరం గ్రామంలో అవగాహన కల్పించారు. సుంకరమెట్ట, బొండం, గన్నేల, పెదలబుడు పంచాయతీల్లో సంక్షేమ పథకాలపై వివరించారు. మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, సచివాలయం కన్వీనర్లు కుమారి, గణేష్, రాధ, సన్యాసి, దనై, నాయకులు నర్సింగ్, పూర్ణచందర్, సుధ, గృహ సారథులు సునీత, శాంతి పాల్గొన్నారు.

పెదబయలు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు సీకరి పంచాయతీ వెల్లపాలెం, బైలువీధి, సీకరి, బొండాపల్లి పంచాయతీ బొండాపల్లి చింతల వీధి, ఎగువ బొండాపల్లి, సంపాపుట్టు గ్రామాల్లో సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. సర్పంచ్‌లు గుల్లేలి కృష్ణారావు, మత్యరాజు, కన్వీనర్లు కొర్రా కనకరాజు, చింతా కొండలరావు, గృహసారథులు కూడా సంధ్యారాణి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కింద్ర పంచాయతీలోని పలు గ్రామాల్లో సోమవారం సర్పంచ్ బూసరి సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ కొంగర మురళీకృష్ణ పర్యవేక్షణలో జగన్ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చెందిన మాట వాస్తవమా కాదా అని ప్రజలను అడిగారు. దీనికి స్థానికులు తమ హర్షం వ్యక్తం చేశారు. రూ.2 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు వివరించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, దాసరి నాగేశ్వరరావు, చిన్నబ్బాయి, బుచ్చిరాజు, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

జి.మాడుగుల: పాలమామిడి పంచాయతీ చిన్నబంధ వీధిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామూర్తిల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. జి.మాడుగుల సచివాలయం-2, సాడేకు గ్రామంలో ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నుర్మని మత్స్యకొండంనాయుడు, వంజరి పంచాయతీలో ఎంపీటీసీ మధు, నుర్మతి పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిబాబు, రమణ ఆధ్వర్యంలోను ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్లు వి. రాధ, గణపతి, నాయకులు ప్రశాంత్, సుబ్బారావు, వి. అచ్చుబాబు, జె. మత్స్యకొండబాబు పాల్గొన్నారు.

గంగవరం: కొత్తాడ పునరావాస కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సర్పంచ్ శారపు కామరాజుదొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడ పునరావాస కాలనీలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలసి ఇంటింటా పర్యటించి సర్వే నిర్వహించారు. మాజీ సర్పంచ్ చవలం సంకురుదొర, సింగారమ్మ, గృహసారథులు రమేష్, కలుముల స్వామి, గ్రామ వలంటీర్లు కారం సంకురుదొర, నాగమణి, బాబూరావు, భవానీ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జగనన్న పాలనలో గిరిజన గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ అన్నారు. పనసపుట్టులో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పనులపై వివరించి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల నేతలు తిరుపతి, జయదేవ్, సన్యాసిరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని పెదబిడ్డ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగబోయిన స్వామి ఆధ్వర్యంలోని ఇంటింటికీ వెళ్లి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టిక్కర్లను అంటించారు. రామంనాయుడు, దేముడు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. రాప, గూడ సచివాలయ పరిధిలో ఎంపీటీసీ కోరాబు నాగలక్ష్మి, సర్పంచ్ లక్ష్మయ్య, మండల యువజన విభాగం కార్యదర్శి వెంకట్, మండల కన్వీనర్ కె.కోటిబాబు, చప్పలి మహేష్, నాయకులు దర్మయ్యదొర పాల్గొన్నారు.

కొయ్యూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలిచిపోతారని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. ఆయన సోమవారం రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబులో ప్రతీ ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులందరికీ అటవీ హక్కుల పట్టాలను ఇచ్చామన్నారు. వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, మాజీ మండలాధ్యక్షుడు సుమర్ల సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు బల్లా కెంపురత్నం, నర్సి కృష్ణ, గృహ సారథులు కోనే కన్నయ్య, వెలుసూరి సోమరాజు, పాట్టిక శ్రీను, రమణ, వెంటక లక్ష్మి సత్యారావు పాల్గొన్నారు. మండల ఉపాధ్యక్షుడు అప్పన వెంకటరమణ ఈ కార్యక్రమాన్ని ఆడాకులలో నిర్వహించారు.

కూనవరం: మండలంలో వెంకటాయపాలెం, చూచిరేవుల గూడెం పంచాయతీల్లో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం సోమవారం ముమ్మరంగా జరిగింది. ఇంటింటా స్టిక్కర్లు, డోర్‌పోస్టర్లు అంటిస్తూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, ఆరెకటిక రాష్ట్ర డైరెక్టర్ అరవా వెంకటరామారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, సర్పంచ్‌లు సోందె ముత్తమ్మ, తెల్లం నిరోషా, ఎంపీటీసీ మడకం నాగరాణి, సోందె పాపారావు, మడకం పూర్ణా, ఎస్ సత్యనారాయణ, లక్ష్మణ్, బేతి ముత్తయ్య, మధు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: చినమట్టపల్లి పంచాయతీ చింతరేగుబల్లి, గుండుగుడెం గ్రామాల్లో జగన్ననే మన భవిష్యత్ కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్ కోటం జయరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ పిట్టా రామరావు, సొసైటీ చైర్మెన్ ముత్యాల మురళి, గూటాల ముత్యాలరావు పాల్గొన్నారు. రాజుపేట పంచాయతీ సీతంపేటలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు ముత్యాల లజపతిరావు, జి.శ్రీనివాస్, పి.నారాయణ, పి.మల్లేశ్, బి.రాజు పాల్గొన్నారు.



కొయ్యూరు: మహిళలకు బ్రోచర్‌ను అందజేస్తున్న ఎంపీపీ



గంగవరం: కొత్తాడలో కార్యక్రమంలో పాల్గొన్న కొత్తాడ సర్పంచ్ కామరాజుదొర, గృహసారథులు



ముంచంగిపుట్టు: కరపత్రాలు ప్రదర్శిస్తున్న పార్టీ మండలాధ్యక్షులు మల్లికార్జున్, నేతలు



అనంతగిరి: పెదబిడ్డలో కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హుకుంపేట: రాపలో వివరిస్తున్న సచివాలయ కన్వీనర్లు, నాయకులు

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పనులు



బొండంలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ భాస్కరరావు, అధికారులు

అరకులోయ రూరల్: జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఏపీవో సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే సోమవారం బొండం పంచాయతీలో సర్పంచ్ భాస్కరరావుతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఈ నెల నుంచి రోజు వారి కూలి రూ.272 ఇవ్వనున్నమన్నారు. ప్రతి కుటుంబానికి రూ.25 వేలు లబ్ధి పొందేలా పనులు కల్పిస్తామన్నారు. పనులు కోరే ఉపాధి కూలీలు ప్రతి శుక్రవారం సంబంధిత వీఆర్పీలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయమివ్వొద్దు



మడుగుకోట యువతకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: అసాంఘిక శక్తులకు ఆశ్రయమివ్వొద్దని ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ మండల లోతట్టు ప్రాంత ప్రజలకు సూచించారు. జనమైత్రి కార్యక్రమంలో భాగంగా సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు జాజిగడ్డ, మడుగుకోట ఎగువవీధి, దిగువవీధి గ్రామాల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సహకరించి జైలు పాలవ్వద్దన్నారు. జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికిపోయి ఇల్లును గుల్ల చేసుకోవద్దన్నారు. యువత పెడతోవ పట్టకుండా కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. గ్రామాల్లో ఏ సమస్యా వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు

12 నుంచి రాష్ట్ర స్థాయి నాటక పోటీలు



నాటక పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎస్ఎన్.రాజు, రాంబాబు, పైడా కృష్ణప్రసాద్

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలను ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణ ప్రసాద్ తెలిపారు. సోమవారం కళాభారతి ఆడిటోరియంలో వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లగా ప్రతి ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈఏడాది రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ సౌజన్యంలో స్వర్గీయ పైడా కౌశిక్ జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా ఉన్న నాటక పరిషత్‌ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. వీటిలో 9 నాటకాలను ఎంపిక చేశామన్నారు. ఈ 9 నాటికలు ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకూ రోజు రెండు నాటకాల చొప్పున ప్రదర్శిస్తారన్నారు. ఆఖరి రోజున ఒక నాటక ప్రదర్శించనున్నామన్నారు. నాటక పోటీలలో ప్రథమ స్థానానికి రూ.15వేలు, ద్వితీయ స్థానానికి 12వేలు, తృతీయ రూ.10వేలు, చతుర్ధ స్థానానికి రూ.7,500లు చొప్పన నగదు బహుమతితోపాటు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాటక పోటీల చీఫ్ కన్వీనర్ డాక్టర్. వేణు, బొడ్డేటి జగత్‌రావు, నాంచారయ్య పాల్గొన్నారు.

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



సబ్బవరం గ్రంథాలయంలో పుస్తకాలు

సబ్బవరం: వివిధ పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా ఉండే పుస్తకాలు సబ్బవరం శాఖా గ్రంథాలయంలోఅందుబాటులోకి వచ్చాయని గ్రంథాలయ అధికారి పీవీ రమణ తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పాఠకులకు అవసరమయ్యే పుస్తకాలు కావాలని అధికారులు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులను కోరారు. ఆ మేరకు వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే 41 పుస్తకాలు పంపినట్టు గ్రంథాలయ అధికారి రమణ తెలిపారు.

రుణాల మంజూరు, చెల్లింపుపై శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: రుణాలు తీసుకోవడంతోపాటు రికవరీపై స్వయం సహాయక సంఘాలు శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. స్థానిక స్త్రీ స్వయం శక్తి భవనంలో సోమవారం గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధన కోసం అమలు చేస్తున్న పథకాలతో భవిష్యత్తు పురోగతికి బాటలు వేసుకోవాలన్నారు. సెర్ప్ ఏపీఎం దుర్గాప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మణికుమారి, సెర్ప్ సీసీలు హాజరయ్యారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అనంతగిరి: టోకూరు పంచాయతీ బోడగుడలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. సోలార్ పథకం మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటికి కటకటలాడుతున్నామని, గెడ్డలు, ఊటలను ఆశ్రయించి రోగలపాలవుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఎన్టీఆర్ స్టేడియం సందర్శన



ఎన్టీఆర్ స్టేడియంలో ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు. మైదానాన్ని సోమవారం వారు సందర్శించి మాట్లాడారు. స్టేడియానికి ఆదాయం వస్తున్నా.. అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆరోపించారు. నేతలు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

125 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు



రాజవొమ్మంగి: జడ్డంగి పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి యామినీప్రియ

వై.రామవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం 125 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. గౌతమి ఆధ్వర్యంలో స్కానింగ్, రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వారిలో 42 మంది హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రిలో చేర్పించారు. వీరందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిలు రాహుల్, చైతన్య, గైనికాల్జిస్టు వాణి పాల్గొన్నారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

113 మంది గర్భిణులకు..

రాజవొమ్మంగి: జడ్డంగి పీహెచ్‌సీలో 113 మంది గర్భిణులను పరీక్షించినట్లు వైద్యాధికారులు సుజి, యామినీపియ తెలిపారు. అవసరమైన వైద్య సలహాలు ఇచ్చామని, ఉచితంగా మందులు అందజేశామని పేర్కొన్నారు. హైరిస్క్ గర్భిణిని గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, హెచ్వీ వెంకటరమణ, స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి, శిరీష, ఎల్టీ సత్యనారాయణ, ఫార్మసిస్ట్ దుర్గ, ఎంఎల్ హెచ్‌పీఎస్ మురళి, సిబ్బంది రమ్య, కుమారి, సరస్వతి, లక్ష్మి ఆశ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనిమియా బాధితరాలికి పింఛన్



యువతికి పింఛన్ కానుక అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని కోట గ్రామానికి చెందిన సికిల్‌సెల్ ఎనిమియా బాధితరాలు గొర్లె శ్రీలత (35)కు సోమవారం ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి వైఎస్సార్ పింఛన్ కానుకగా రూ.10 వేలతోపాటు, పింఛన్ కార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గతంలె ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మిల చొరవతో వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ఆమెకు నెలకు రూ.10 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా మొదటి నెల పింఛన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమల్ల సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మామిడి అప్పారావు, మండల జేసీఎస్ కన్వీనర్ కరణం కనక రాజు, సచివాలయ కన్వీనర్లు కంచర్ల విజయకుమార్, గేదెల అబ్బాయిరెడ్డి, కోట సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు ఎ.చిట్టిబాబు, గ్రామ వలంటీరు గుర్ల శ్రీవిద్య పాల్గొన్నారు.

18 నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

అనకాపల్లిటౌన్: స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 18 నుంచి మునగపాక హైస్కూల్‌లో పాలిసెట్-23కు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు శిష్ట ల తమ్మిరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి విద్యార్థులకు పాలిసెట్‌పై శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు 89193 60208 నంబర్‌లో సంప్రదించాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేడే పుష్పాలు కనువిందు



అనంతగిరిలో ఓ ఇంటి వద్ద నెల ముందుగానే మేడే పుష్పాలు కనువిందు చేశాయి. ఏటా మే నెలలో ఈ పూలు పూస్తుంటాయి. అయితే నెల రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలతో ముందుగానే ఇవి పూసి ఆశ్చర్యపరిచాయి. - అనంతగిరి